క్లుప్తంగా

పీఎంజేజేబీవై చెక్కు పంపిణీ



లబ్ధిదారుకు చెక్ అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజరు

పూసపాటిరేగ: ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పూసపాటిరేగ ఎస్‌బీఐ మేనేజరు మురళి అన్నారు. స్థానిక స్టేట్‌బ్యాంకులో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్(సీఎఫ్‌ఎల్) సహకారంతో పీఎంజేజేబీవై లబ్ధిదారు పొండ్రంకి పైడిరాజుకు రూ.2 లక్షల చెక్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో వున్న కుటుంబాలకు ఈ పథకం ఎంతోగానో ఉపయోగపడుతోందన్నారు. కౌన్సిలర్ ఎం.రాజారావు, పూసపాటిరేగ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు బి.శైలజ, టి.అంజనీగీత తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన జిల్లా జడ్జి

విజయనగరం లీగల్: ఖైదీల పట్ల సిబ్బందిగాని, తోటి ఖైదీలుగాని ఎటువంటి వివక్షత చూపించరాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత అన్నారు. జిల్లాలోని పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరంలలో గల సబ్ జైళ్లను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి తొలుత న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జైళ్లల్లో ఉన్న ఖైదీల పట్ల వివక్షత చూపించరాదన్నారు. జైలులో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. ప్రతీ ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని, మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. సకాలంలో న్యాయ సహాయం అందించడానికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ఏర్పాటు చేశామన్నారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే ముఖ్య కర్తవ్యమన్నారు. స్టోర్ రూమ్‌ను, వంటలు చేసే పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ లాయర్స్, పేరా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైద్యుల సమ్మెకు మద్దతు

విజయనగరం ఫోర్ట్: తమ సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల అసోసియేషన్ అధ్యక్షుడు కె.సత్యం అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ 26 నుంచి అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు సమ్మె బాట పట్టారని తెలిపారు. అందులో భాగంగా ఆన్‌లైన్ రిపోర్టింగ్ సేవలు బంద్ చేశారని తెలిపారు. 27 నుంచి స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం, 104 సంచార వైద్య సేవలు బంద్ చేశారన్నారు. 28న అధికారిక వాట్సాప్ గ్రూపును బహిష్కరించారని, అక్టోబర్ 1న జిల్లా కేంద్రాల్లో నిరసన చేపట్టనున్నారని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం

రామభద్రపురం: టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి శంబంగి వేణుగోపాలనాయుడు విమర్శించారు. కెనడా విహార యాత్ర ముగించుకుని మంగళవారం బొబ్బిలి వచ్చిన వేణుగోపాలనాయుడు,బొబ్బిలి ఎంపీపీ లక్ష్మి దంపతులను స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో పాటు పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడు తూ ఎన్నికల హామీలను నెరవేర్చ కుండా చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్త లంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల వారిని మోసం చేసిందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే గుంతలు లేని రోడ్లను చూస్తారని ఎన్నికల సమయంలో కూటమి నేతలు చెప్పారని,గ్రామీణ ప్రాంత రోడ్ల గుంతల్లో ఎక్కడా తట్టెడు మట్టి వేసిన పాపానపో లేదని విమర్శించారు. మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యూత్ విభాగం అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పార్టీ మండల ఉపాధ్యాక్షుడు దర్రు పైడిరాజు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్,పార్టీ సోషల్‌మీడియా కన్వీనర్ మరిపి శ్రీనివాసరావు సీనియర్ నాయకులు కనిమెరక అప్పారావు,తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దూరం

మెరకముడిదాం: మండలంలోని పలువురు రైతులకు చెందిన జాయింట్ ఎల్‌పీఎంలు ఆన్‌లైన్ కాకపోవడంతో అన్నదాత సుఖీభవ పథకానికి దూరమవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. సచివాలయ సిబ్బందని కలిసినా ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు. అవసరానికి భూమి క్రయవిక్రయాలు జరగడంలేదంటూ గగ్గోలు పెడుతున్నారు. సమస్యను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతున్నారు.

2న షిరిడిసాయి సమాధి ఉత్సవం

చీపురుపల్లి: పట్టణంలోని రుంకానవీధిలో ఉన్న శ్రీ దత్తసాయి మందిరంలో షిర్డి సాయిబాబా 107వ సాయి సమాధి ఉత్సవం నిర్వహించనున్నట్లు మందిర నిర్వాహకులు తంగుడు రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా సహస్ర నామపారాయణం, షిరిడి సాయి పల్లకి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఇలా అయితే.. ఎలా..?



జంగిల్ క్లియరెన్స్ లేక కుమిలి రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

- రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన మొక్కలు
- జంగిల్ క్లియరెన్స్ లేక ప్రమాదాలు
- ఆందోళనలో వాహన చోదకులు

పూసపాటిరేగ: రహదారుల నిర్మాణంపై కూటమి సర్కారు నిర్లక్ష్యం వహించడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా రహదారులు మరమ్మతులకు సంబంధించి ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. రహదారికి ఇరువైపులా అడవిని తలపించినట్టు మొక్కలు పెరగడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జంగిల్ క్లియరెన్స్‌కు నిధులు ఖర్చు అయినా ఫలితం ఇవ్వని పరిస్థితి. సీహెచ్ అగ్రహారం నుంచి కుమిలి, మింగనాపల్లి, గుణపూరుపేట మీదుగా విజయనగరం వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. పూసపాటిరేగ నుంచి కొవ్వాడ అగ్రహారం, గుంపాం, తొత్తడాం, పతివాడ, రోలుచప్పిడి మీదుగా వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు ఏపుగా పెరగడంతో ప్రమాదాలకు ఆస్కారం నెలకొంది. నిత్యం ఆ రహదారి గుండా వందలాది వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. కోనాడ జంక్షన్ నుంచి కొప్పెర్ల, నడిపల్లి, బూరపేట, వెల్దూరు, కిలుగుపేట, తిప్పలవలసకు వెళ్లే రహదారిలోను ఇరువైపులా మొక్కలు ఏపుగా పెరిగాయి. ఎరుకొండ జంక్షన్ నుంచి పసపాం, మర్రిపేట, కొల్లాయివలస, రాయుడుపేటకు వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు ఏపుగా పెరిగాయి. జంగిల్ క్లియరెన్సుకు లక్షలాది రుపాయిలు ఖర్చు చేసినట్టు రికార్డులు చెబుతున్నా పనులు ఎక్కడ జరుగుతున్నాయో తెలియని పరిస్థితి. ఆర్అండ్‌బీ అధికారులు చేసిన పనులు కేవలం రికార్డులకే పరిమితి అయ్యాయనే వాదన వినబడుతోంది. ఆయా రహదారులలో రహదారి ఇరుకుగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేసి ప్రమాదాలు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రహదారికి ఇరువైపులా అడవిని తలపించినట్టు మొక్కలు పెరగడంతో ప్రమాదం పొంచి వుంది. సిహెచ్.అగ్రహారం నుంచి కుమిలి మీదుగా విజయనగరం వెళ్లే రహదారిలో అడవిని తలపించేలా పిచ్చి మొక్కలు పెరిగాయి. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా వుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– నడిపేన గౌరీశ్వరరావు, పూసపాటిరేగ

జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి

రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించాలి. వర్షాకాలం కావడంతో చెట్లు ఏపుగా పెరగడంతో వాహనాలు అతి సమీపంలోకి ఎదురెదురుగా వచ్చిన వరకు కనిపించడం లేదు. దీని వలన ఏదో మూలన ప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు లక్షలాది రుపాయిలు రహదారులు మరమ్మతులకు వెచ్చిస్తున్నట్టు చెబుతున్నా ఫలితం లేదు.

– కె.రమణమూర్తి, పేరాపురం

డాక్టర్ ద్వారం లక్ష్మికి జ్ఞానసరస్వతీ విశిష్ట పురస్కారం



డాక్టర్ ద్వారం లక్ష్మికి జ్ఞానసరస్వతీ విశిష్ట పురస్కారం అందజేస్తున్న శారదా సేవాసంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: ప్రముఖ సంగీత ఆచార్య, కళారత్న, రామాయణ పదకోకిల డాక్టర్ ద్వారం లక్ష్మి జ్ఞానసరస్వతీ విశిష్ట పురస్కారం అందుకున్నారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక రింగురోడ్డు ఎస్‌వీఎన్ నగర్‌లో కొలువైన జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో మంగళవారం రాత్రి ప్రముఖ వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు, అతిథులు చేతుల మీదుగా అవార్డును అందజేశారు. శ్రీ శారదా సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుడిశ శివకుమార్, చెరుకూరి శ్రీధర్‌లు దుశ్శాలువ, జ్ఞాపికతో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యల నగరమైన విజయనగరంలో జ్ఞానసరస్వతీ విశిష్ట పురస్కారం తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమానికి ముందు నిర్వహించిన గాత్రకచేరీ ఆద్యంతం ఆహుతుల కరతాళ ధ్వనులందుకుంది. సీనియర్ సెక్షన్ ఇంజినీర్ వెంకట చక్రధర్‌ను శ్రీ జ్ఞానసరస్వతీ పురస్కారంతో నిర్వాహకులు సత్కరించారు. జిల్లా స్థాయిలో ఇంటర్, టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు డాక్టర్ చెరుకూరి చక్రపాణి స్మారక జ్ఞాన సరస్వతి ప్రతిభా అవార్డులను, మహారాజా సంగీత, నృత్య కళాశాల విద్యార్థులకు శారదా సేవా సంఘం సరస్వతి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం: నిస్వార్థమైన సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణతోనే స్వచ్ఛంద సంస్థలకు పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్వీఎన్ హోటల్లో రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన రోటరీ గవర్నర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ద్వారా యువత విస్తృతంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం వల్లే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారు సైతం జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు. రక్తదాతల మేలు మరువలేనిదని, రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని పేర్కొన్నారు. యువత అవగాహనతో రక్తదాన శిబిరాల నిర్వహణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రోటరీ క్లబ్బుల ద్వారా ప్రతి ఏడాది విస్తృతంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని వివరించారు. శిబిరంలో క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్‌కుమార్, ప్రతినిధులు ఆర్.శంకర్ రెడ్డి, టి.ఎల్.ఎన్.మూర్తి, కాపుగంటి ప్రకాష్, కృష్ణ తేజ, చెన్నా ప్రదీప్, రోహిత్ సంజయ్, జయకృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు : ఎస్పీ



పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్ఐ విశ్వనాథంను సత్కరిస్తున్న ఎస్పీ, చిత్రంలో ఏఎస్పీ, ఏఆర్ ఏఎస్పీ తదితరులు

విజయనగరం క్రైమ్: విధి నిర్వహణలో ఉద్యోగులు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా పోలీసు శాఖలో నాలుగు దశాబ్దాలుగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఏఆర్ ఎస్ఐ కూరంగి విశ్వనాథం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా గుర్తింపు పొందవచ్చన్నారు. అలాంటి సేవలను అందించిన విశ్వనాథం ఉద్యోగ విరమణ జీవితం ప్రశాంతంగా ఆనందమయంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం విశ్వనాథం కుటుంబ సభ్యులతో ఎస్పీ ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విశ్వనాథంను ఎస్పీ శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, కోఆపరేటివ్ సభ్యులు నాయుడు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



నెల్లిమర్ల: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దుర్గమ్మ అలంకరణలో అమ్మవారు



విజయనగరం టౌన్: పూల్‌బాగ్ లక్ష్మీగణపతి కాలనీలో చీరల అలంకరణలో దుర్గమ్మ



నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ వర్సిటీలో చండీహోమం



బాబామెట్ట దేవీపార్క్ వద్ద ఏకరూప చీరలతో 400 మంది సుహాసినీల సామూహిక కుంకుమార్చనలు



విజయనగరం: చదురుగుడి వద్ద అమ్మవారి జాతరలో ఏర్పాటు చేసిన పులి వేషాలు

శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రోజుకొక అవతారంలో దర్శనమిస్తున్న దుర్గాదేవిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కుంకుమ పూజల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆలయాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో ఊరూ... వాడా... ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని నెల్లిమర్ల ఎస్ఐ గణేష్ హెచ్చరించారు. మండలంలోని ఆల్తిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనతో నడుచుకోవాలన్నారు. చిన్న చిన్న గొడవలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. తగాదాలకు, కొట్లాటలకు దిగితే జైలు జీవితం గడపాల్సి వస్తుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండి భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. ఎటువంటి అలజడులు ఏర్పడినా తమకి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పప్పల భాస్కరరావు, గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్న సమారాధన

భోగాపురం: మండల కేంద్రంలోని ముక్కాం జంక్షన్ వద్ద శ్రీకనకదుర్గమ్మతల్లి ఆటో యూనియన్ సభ్యులు శ్రీకనకదుర్గమ్మ మండపం వద్ద మంగళవారం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారని ఆటో యూనియన్ సభ్యులు వనుం రమణ, కొల్లి అప్పారావు, పిట్టా రామసూరి, మరడ రవి, ఎద్దు అప్పారావు, తదితరులు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

భోగాపురం: నియోజకవర్గంలోని భోగాపురం, నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు వివిధ రోగాలకు చికిత్స చేయించుకోగా వారికి మంజూరైన రూ.1,60,405ల చెక్కులను ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మంగళవారం తన స్వగృహంలో లబ్ధిదారులకు అందజేశారు. చెక్కులు అందుకున్న వారిలో అరిశెట్టి రామారావు, మద్ది సింహచలం, బుగత రమేష్ ఉన్నారు. ఈ సందర్భంగా ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు మాట్లాడుతూ సీఎం సహాయనిధి పేదలకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుందన్నారు. కనిమెట్ట, గుడివాడ సర్పంచ్‌లు కునిశెట్టి గోవిందరావు, చిల్ల జమున, కొండపు ఈశ్వరరావు, డోప్ప జోగులు, కాళ్ళ రాజశేఖర్, చిల్ల పరుశురామ్, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 5న కవి సమ్మేళనం

విజయనగరం టౌన్: విజయనగరం ఉత్సవాలలో భాగంగా అక్టోబరు 5న కవి సమ్మేళనం, 6న పుస్తక పరిచయ సభ నిర్వహిస్తున్నట్టు మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రాచార్యులు, వేదిక కన్వీనర్ డాక్టర్ జనార్దన్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సాహిత్యాన్ని ప్రతిబింబించేలా కవితలు ఉండాలన్నారు. వివరాలకు చీకటి దివాకర్ 9441176882, సముద్రాల గురుప్రసాద్ 9490462262, సూర్యలక్ష్మి 9440117116, డాక్టర్ జక్కు రామకృష్ణ 9441427386, జిఎస్.చలం 9490106390 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పథంలో కెల్ల సొసైటీ

గుర్ల: మండలంలోని కెల్ల సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండేలా చేసిన ఘనత సొసైటీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి సూర్యనారాయణకే దక్కుతుందని కెల్ల సొసైటీ చైర్మన్ కె.విమలరాణి కొనియాడారు. కెల్ల సొసైటీ ఆవరణలో ఆయనను నూతనంగా నియామకమైన చైర్మన్, కార్యవర్గ సభ్యులు మంగళవారం సత్కరించారు. కెల్ల సొసైటీ ఆర్థికంగా బలంగా ఉందని, రైతులకు అవసరమైన అన్ని సేవలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి సహకరించిన సొసైటీ సిబ్బందికి సూర్యనారాయణ రాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కెల్ల సురేష్, కెల్ల పైడిరాజు, సొసైటీ సీఈఓ మండల శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.



కెల్ల సొసైటీ మాజీ చైర్మన్ సూర్యనారాయణరాజును సత్కరిస్తున్న కెల్ల సొసైటీ చైర్మన్ విమలరాణి, కార్యవర్గ సభ్యులు

భీమసింగి సుగర్స్‌పై ప్రభుత్వ తీరు సరికాదు..



మాట్లాడుతున్న భీశెట్టి

విజయనగరం గంటస్తంభం: జిల్లాలో సహకార రంగానికి ప్రతిష్టాత్మకమైన భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్తుపై కూటమి ప్రభుత్వం ఇప్పటివరకూ స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంపై లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలోని తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలను మూసి వేయడం వల్ల చెరకు రైతులు, కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు నాయుడు, యువగళం పాదయాత్రలో లోకేష్ భీమసింగి చెరకు రైతులకు ఫ్యాక్టరీ మళ్లీ ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే నేటి వరకూ ఆ దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఫ్యాక్టరీ కార్మికుల పీఎఫ్, గ్రాట్యుటీ బకాయిలుగా రూ.నాలుగు కోట్లు ప్రభుత్వం చెల్లించాలని, కానీ ఎన్నిసార్లు మంత్రిని కలిసినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఆవేదనతో కొందరు కార్మికులు బకాయిలు అందుకోకుండానే ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ గజపతినగరం నియోజకవర్గ పరిధిలోనే ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు అదే నియోజకవర్గంలో పర్యటిస్తున్న సందర్భంగా ఈ ఫ్యాక్టరీ భవిష్యత్తుపై స్పష్టమైన ప్రకటన చేయాలని భీశెట్టి డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీని ఇథనాల్ కర్మాగారంగా మార్చి చెరకు రైతులను ఆదుకునే దిశగా ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. సమావేశంలో పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, బెండి చిరంజీవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సుంకాలను వ్యతిరేకించాలి : సీపీఎం



సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ

విజయనగరం గంటస్తంభం: భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న 50 శాతం సుంకాల వల్ల ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందని, ప్రత్యేకించి ఆక్వా రంగం పూర్తిగా నష్టపోతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు వడ్డీలేని రుణాలు అందించాలని, పెట్టుబడిదారులపై అదనపు పన్నులు విధించాలని, దేశీయ ఉత్పత్తి పెంచే విధానాలను అమలు చేయాలని ఆయన సూచించారు. అమెరికా సుంకాలను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిస్తూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎం మంగళవారం నుంచి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్యక్రమం భాగంగా అయ్యన్నపేట ప్రాంతంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, నగర కమిటీ సభ్యులు బి.రమణ, రంభ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి రెండున్నర గంటల వరకూ అమ్మవారికి పూజారులు ప్రత్యేక భోగం సమర్పించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. వనంగుడిలో అమ్మవారు పుష్పాలకంరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

పైడిమాంబ ఆశీస్సులతో యూట్యూబ్‌లో లక్కీ ట్రెండ్

- గతేడాది పాడిన పాట నేడు వైరల్ అవుతున్న వైనం
- ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తున్న యువకుడు
- ఆర్థిక సహకారమందిస్తే మరిన్ని అద్భుతాలు



యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతున్న అమ్మలగన్నా అమ్మా.. శ్రీ పైడితల్లి అమ్మా.. పోస్టర్

విజయనగరం టౌన్: 'అమ్మలగన్నమ్మా...శ్రీ పైడితల్లెమ్మా... జాతర శివ జాతర తల్లి నీదేనమ్మా..' అంటూ విజినిగిరి లక్కీ తన స్వీయరచన, గానాలాపనతో సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం వైరల్ అవుతున్నాడు. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీ పైడితల్లిని స్తుతిస్తూ చేసిన గానాలాపన ఇప్పుడూ అందరినీ విశేషంగా ఆకట్టుకుంటుంది. సంకల్ప బలం ఉంటే ఎంతటి కష్టాన్ని అయినా గట్టెక్క వచ్చనేది నిరూపిస్తున్న ఈ యువకుడు పైడితల్లి పాటతో భక్తుల్లో తమ భక్తి భావాన్ని మరింత పెంచి, అందరి మన్ననలు అందుకుంటున్నాడు.

గజపతినగరం మండలం ముచ్చెర్ల గ్రామానికి చెందిన విజినిగిరి లక్ష్మునాయుడు లక్కీగా అందరికీ సుపరిచితుడు. తండ్రి రాము, తల్లి పైడిరాజు టిఫిన్ షాపు నడిపిస్తూ కుటుంబ పోషణ చేస్తున్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ వరకూ చదువుకున్న లక్కీ విద్యల నగరమైన విజయనగరంలో ఓ పక్క పార్ట్‌టైమ్ జాబ్ చేసుకుంటూ మరోపక్క పీజీ చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి జానపద గేయాలు పాడటంతో పాటూ స్వీయ రచనలు చేసి పాడటం సొంతంగా నేర్చుకున్నాడు. అందుకు తగ్గట్టుగా డ్యాన్స్ చేయడం హాబీగా చేసుకున్నాడు. మూడో తరగతి నుంచే పాటలను పాడటం, రాయడం నేర్చుకున్న ఈ 25 ఏళ్ల కుర్రాడు నేడు అద్భుతమైన పాటలు పాడుతూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు. సొంతంగా వి9 పేరుతో యూట్యూబ్ చానల్ క్రియేట్ చేసుకుని తన పాటలను అప్‌లోడ్ చేశాడు. ఎంతో శ్రమించి గతేడాది పైడితల్లి అమ్మవారి ఉత్సవాలలో షూటింగ్ పూర్తి చేసుకుని పాటను రిలీజ్ చేశాడు. నాటి పాట నేడు క్లిక్ అయింది. 13 పాటలను షూటింగ్ పూర్తిచేసి యూట్యూబ్‌లో పెట్టాడు. శ్రీ పైడితల్లి అమ్మవారి మీద పాడిన పాట ఒక్కసారిగా క్లిక్ అవ్వడంతో ఎంతో ఆనందాన్ని, ఆ తల్లి ఆశీస్సులు పొందగలిగానని చెబుతున్నాడు. ప్రస్తుతం మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో గాత్రం నేర్చుకుంటున్నానని తెలిపాడు.

ఆర్థికంగా సహకరిస్తే అద్భుతమైన పాటలు రాస్తా..

నా పాటకు నేనే రచయితను. సొంతంగానే రాస్తాను. ఇప్పటి వరకూ 15 పాటలు, వీడియోలు చేశాను. కార్తీకమాసం ప్రత్యేకం, పైడితల్లి అమ్మవారిపై మరోపాట సిద్ధంగా ఉన్నాయి. ఆర్థికంగా దాతలు సహకరించి ముందుకు వస్తే మరిన్ని అద్భుతమైన రచనలు చేసి పాడతాను. అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను. చదువుతో పాటూ పార్ట్‌టైమ్ జాబ్, రాత్రి నిద్ర వచ్చే వరకూ మంచి రచన, దానికి ట్యూన్ చేయడం హాబీగా మారిపోయాయి.

– లక్కీ, సింగర్, విజయనగరం